ప్రజాశక్తి

బుధవారం 26 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఉక్కు ఉద్యమం మరింత తీవ్రం

- ప్రయివేటీకరణపై కేంద్రం వెనక్కి తగ్గేవరకు పోరాటం
- నేడు స్టీల్ ప్లాంట్ గేట్ వద్ద భారీ బహిరంగ సభ
- హాజరు కానున్న సిపిఎం, సిపిఐ జాతీయ నేతలు బివి రాఘవులు, కె నారాయణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విశాఖ ఉక్కు-తెలుగోడి హక్కు'.. అన్న నినాదంతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం రెండున్నరేళ్ల క్రితం నూరు శాతం అమ్మకానికి పెట్టడంతో సుమారు 803 రోజులుగా స్టీల్ కార్మికులు, ప్రజలు పోరాడుతున్నారు. తాజాగా ఉక్కు పోరును మరింత తీవ్రం చేసే దిశగా కార్మికవర్గం సమాయత్త మవుతోంది. అందులో భాగంగా ఢిల్లీకి మరింత గట్టిగా తమ వాణి వినిపించేందుకు కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద భారీ బహిరంగ సభను బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించ తలపెట్టారు. ఈ సభలో పాల్గొనేందుకు సిపిఎం, సిపిఐ జాతీయ నేతలు బివి రాఘవులు, కె నారాయణ బుధవారం విశాఖకు విచ్చేస్తున్నారు. తమ పోరాట శంఖాన్ని మరింత బలంగా వినిపించేందుకు కార్మికులు ప్రణాళికలను రచిస్తున్నారు. కార్మిక పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు (బిజెపి మినహా) బాసటగా నిలుస్తూ వస్తున్నాయి. కేంద్రంలోని బిజెపి సర్కారు వెనక్కి తగ్గే వరకూ పరిరక్షణ ఉద్యమం కొనసాగుతుందంటూ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి స్టీల్‌ప్లాంట్ నాయకులు జె అయోధ్యరాం, ఆదినారాయణ ఉద్ఘాటించారు.

క్రాంతినగర్‌లో ప్రచార క్యాంపెయిన్‌లో మాట్లాడుతున్న జగ్గునాయుడు

కేంద్రం నయవంచన...

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మే ప్రణాళికలో భాగంగా బ్లాస్ట్ ఫర్నేస్ ఒకదాన్ని నిలిపివేసి రా మెటీరియల్ సరఫరా కాకుండా కేంద్ర సర్కారు ఆటంకాలు సృష్టిస్తూనే ఉంది. ఇటీవల రా మెటీరియల్ (ఐరన్ ఓర్, కోల్, వర్కింగ్ కేపిటల్) కోసం బిడ్లను యాజమాన్యం మిగతా 2లో..

28న జివిఎంసి కౌన్సిల్

32 అంశాలతో అజెండా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 28న నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించేందుకు పాలకవర్గం నిర్ణయించింది. మొత్తం 32 అంశాలతో కూడిన అజెండాను ఇప్పటికే సిద్ధం చేశారు. అయితే పలు ప్రతిపాదనలపై వాడి, వేడిగా సభ్యుల మధ్య చర్చ సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలే సుమారు రూ.100 కోట్ల వరకూ ఖర్చుచేసి జి-20, గ్లోబల్ సమ్మిట్ వంటివి నగరంలో నిర్వహించి జివిఎంసిపై ఆర్థిక భారం మోపడం వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి. అజెండాలో ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదనలు చాలా వరకూ ఉన్నాయి. 227 వాహనాల నిర్వహణకుగానూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.5.45 కోట్లు వ్యయం చేసేందుకు కౌన్సిల్ అజెండాలో పొందుపరిచారు. ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న 5411 మంది కార్మికులు, ఇంజినీరింగ్ విభాగంలోగల 70 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లను 2023-24 ఆర్థిక సంవత్సరంలో కొనసాగించడానికి ఆమోదం కోరారు. వేతనాల వ్యయం రూ.172 కోట్లుగా ప్రతిపాదన చేశారు. 8వ వార్డు సాగర్‌నగర్‌లో రూ.1.86 కోట్లు, 11వ వార్డులో రూ.1.78 కోట్లుతో కాలువల నిర్మాణానికి ప్రతిపాదించారు.

జివిఎంసి ఉద్యావన శాఖ ఎడిహెచ్‌గా పనిచేస్తున్న దామోదరరావును డిడిహెచ్ (డిడి హార్టికల్చర్)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పాలకవర్గం ఆమోదించనుంది. కొన్నేళ్ల నుంచి ఆయన ఇక్కడే కొనసాగుతుండడం కొంతమందిలో అసంతృప్తి ఉంది. ప్రమోషన్ అనంతరం బదిలీ జరగాల్సి ఉన్నా ఇక్కడే కొనసాగించే ఏర్పాట్లను చేయడం విశేషం. జివిఎంసిలో సహాయ ఇంజినీర్లుగా పనిచేసి రిటైర్ అయిన ఇద్దరిని తిరిగి విధుల్లోకి తీసుకోడానికి అనువైన ప్రతిపాదనలు చేశారు. సీతకొండకు వైఎస్ఆర్ వ్యూ పాయింట్ పేరు మార్పు, 38 మంది గజ ఈతగాళ్ల నియామకంపైనా చర్చ జరుగనుంది.

రూ.600 కోట్లతో కెజిహెచ్ అభివృద్ధి పనులు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు పొరుగు జిల్లాల ప్రజలకూ విశిష్ట వైద్య సేవలు అందిస్తున్న కెజిహెచ్‌లో రూ.600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభం కాగా మరికొన్ని దశలవారీగా జరుగుతున్నాయని వెల్లడించారు. కెజిహెచ్‌లో కొంతకాలంగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న సుబ్బరామిరెడ్డి సత్రాన్ని రూ.50 లక్షలతో ఆధునికీకరించగా మంగళవారం మిగతా 2లో..

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రజని

నిరుపయోగంగా మారిన కౌన్సిల్ సమావేశాలు

సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ఎంవిపి.కాలనీ : ఈ నెల 28న జివిఎంసి కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో అజెండాలో ఉంచిన మొత్తం 32 అంశాలు ప్రాధాన్యత లేనివని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీటిల్లో అత్యధికం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేవికావని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి తోడ్పడే అజెండాలు లేవని తెలిపారు. జివిఎంసి కౌన్సిల్ సమావేశాలన్నీ నిరుపయోగంగానూ, నగరాభివృద్ధిని నిర్లక్ష్యం చేసేవిగానూ జరుగుతున్నాయన్నారు. ఈ వైఖరిని మిగతా 2లో..

చందనోత్సవం టిక్కెట్ల అమ్మకాలపై విచారణ

ప్రజాశక్తి - సింహాచలం : ఇటీవల అప్పన్న చందనోత్సవం రోజున అధిక సంఖ్యలో భక్తుల తరలిరావడం, సౌకర్యాలు కరువవడంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో విశాఖ జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మంగళవారం దేవస్థానం కార్యాలయంలో విచారణ చేపట్టారు. కంప్యూటర్ రికార్డులను, బ్యాంకుల ద్వారా అమ్మిన టిక్కెట్ల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట రూరల్ తహశీల్దార్ రమణయ్య, తదితరులు ఉన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయ ఇఒగా శిరీష

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు ఉద్యమం మరింత తీవ్రం

ఆహ్వానించగా 29 సంస్థలు ముందుకొచ్చాయి. ఈ ప్రక్రియ అయినా సజావుగా సాగితే స్టీల్‌ప్లాంట్ పని ముందుకెళ్తుందని కార్మికవర్గం భావిస్తోంది. స్టీల్‌ప్లాంట్ సామర్థ్యాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి సర్కారు ట్రాన్జేక్షన్, లీగల్ అడ్వైజరీ కమిటీలను నియమించిన విషయం తెలిసిందే. ఇటీవలే కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి విచ్చేసినా స్టీల్‌ప్లాంట్‌పై ద్వంద్వ ప్రసంగాలు చేసి వెళ్లిపోవడం బిజెపి ఆడుతున్న నాటకంలో భాగమేనని రాష్ట్ర ప్రజలు గుర్తించారు. తక్షణమే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం జరిగే భారీ బహిరంగ సభలో నేతల ప్రసంగాలు జాతీయ స్థాయిలో బిజెపి సర్కారులో కదలిక తేవాలంటూ ప్రజానీకం కోరుకుంటున్నారు.

సభను జయప్రదం చేయండి :

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

విశాఖ స్టీల్‌ప్లాంటుకు, ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలపై బుధవారం సాయంత్రం కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంటు ఆర్చి వద్ద జరిగే బహిరంగ సభలో కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. సిపిఎం కార్యకర్తలు, శ్రేణులు ప్రజలను సభకు సమీకరించాలని కోరారు. క్రాంతినగర్‌లో జరిగిన ప్రచారభేరి క్యాంపెయిన్‌లో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ.. ఆంధ్ర రాష్ట్ర మణిహారం, విశాఖ ఉపిరి అయిన వైజాగ్ స్టీల్‌ప్లాంటును బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని తెలిపారు. ప్లాంటుకు సొంత గనులు, 8500 మంది నిర్వాసితులకు ఉపాధి ఇవ్వడం లేదని అన్నారు. మూడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్, రైల్వే రేక్స్‌కు ఆటంకాలు సృష్టించి విశాఖ ఉక్కును ఖాయిలా చేసే కుట్రలో ఉందన్నారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ఏపి పునర్విభజన చట్ట హామీలు, ప్రత్యేక రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నిధులు, ఉత్తరాంధ్ర ప్యాకేజీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రజలకు ఇంతద్రోహం చేస్తుంటే అధికార వైసిపి, ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, జనసేనలు నిలదీయడం లేదని, బిజెపితో చెలిమికి, అధికారం కోసం వెంపర్లాడుతున్నాయని తెలిపారు. ఈ స్థితిలో ప్రజలు మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు ఎన్.శ్రీనివాసరావు, డి.గోపాలకృష్ణ, ఎం.ఆదినారాయణ, ఎస్.లోకేశ్వరరావు, ఎస్.ఏసుబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేలాదిగా తరలిరండి : సిఐటియు, ఎఐటియుసి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణను కాంక్షిస్తూ బుధవారం కూర్మన్నపాలెంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరామ్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. సిపిఐ, సిపిఎం ప్రచార భేరిలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్దనున్న ఉక్కు దీక్షా శిబిరం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు ప్రసాద్, ఎఐటియుసి ఉపాధ్యక్షులు జె.రామకృష్ణ పాల్గొన్నారు. మరోవైపు ఉక్కు పరిరక్షణ దీక్షలు మంగళవారానికి 803వ రోజుకు చేరుకున్నాయి. ఎక్స్ సర్వీస్‌మ్యాన్లు కూర్చున్నారు. వారినుద్దేశించి సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడారు.

నిరుపయోగంగా మారిన కౌన్సిల్ సమావేశాలు

సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో 7.50 కోట్లకుపైగా వాహనాల రిపేర్లుకు ఖర్చు కోసం అజెండాలో పెట్టారని, వీటికి మేయర్ ముందస్తు అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఏమిటని, ఇదేకాదు.. చాలా అంశాలకు ముందస్తు అనుమతి ఇస్తూ కౌన్సిల్‌ను ఉత్సవ విగ్రహంలా మార్చేస్తున్నారని తెలిపారు. కమీషన్లు భారీగా వచ్చే పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అంచనాలు రెండు రెట్లు అధికంగా చూపుతున్నారన్నారు. వీటిపై ఎలాంటి ఆడిట్ ఉండటం లేదని తెలిపారు. ఈ కౌన్సిల్‌లో జోన్ – 3, జోన్ – 4లలో వెండింగ్ జోన్లను, బీచ్‌లో 10 జోన్లను ప్రతిపాదించారని తెలిపారు. వెండింగ్ జోన్లలో స్ట్రీట్ వెండార్స్ కేటాయింపుల్లో భారీ అవినీతి జరుగుతున్నట్టు పేర్కొన్నారు. సీతకొండ మలుపు పాయింట్‌ను వైఎస్ఆర్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేయడంపై సిపిఎం అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. జివిఎంసిలో అధికార పార్టీ ప్రోద్బలంతో కొందరిని కన్సాలిడెట్, అడ్వయిజర్స్, కన్సల్టెంట్లు గౌరవవేతనం పేర కొనసాగిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. నగరానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక లేదని, రెండేళ్ల పూర్తయినా నేటికీ వైసిపి పాలకవర్గం సమగ్ర ప్రణాళిక తీసుకురాలేకపోవటంపై సిపిఎం విస్మయాన్ని వ్యక్తం చేస్తోందని తెలిపారు. ఏడాదికి కనీసం వార్డుల్లో ప్రజాభివృద్ధికి రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని తెలిపారు.

రూ.600 కోట్లతో కెజిహెచ్ అభివృద్ధి పనులు

ఆమె ఆ సత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 200 పడకలతో, మహిళలు, పురుషులకు వేరువేరుగా ఈ సత్రాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కేవలం రోగుల సహాయకుల కోసం ఆధునికీకరించబడిన ఈ సత్రంలో బస చేసే సహాయకులు ఒక్కొక్కరూ రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఉండేవారికి రెండు పూటలా భోజనం, ఇతర సౌకర్యాలు ఉచితంగా లభిస్తాయన్నారు. దీని ఆధునికీకరణకు రూ.30 లక్షల సిఎస్ఆర్ నిధులను కలెక్టర్ సమకూర్చగా, రూ.20 లక్షలను ఇస్కాన్ సంస్థ ఇచ్చిందన్నారు. కెజిహెచ్‌లో అభివృద్ధి పనులకు హెచ్‌పిసిఎల్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.2.6 కోట్లు ఇటీవల ఇచ్చిందని, అలాగే 25 అంబులెన్స్‌లు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కెజిహెచ్‌ను అతిపెద్ద కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నాడు – నేడులో భాగంగా కెజిహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎంపి ఎంవివి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇస్కాన్ ప్రతినిధి సాంబదాస్, కార్పొరేటర్ కె.అప్పలరత్నం పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా శిరీష

ప్రజాశక్తి- కలెక్టరేట్ : బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఒగా విశాఖ జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీషకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఇఒ రమేష్‌నాయుడును కృష్ణాజిల్లా తిరుపతమ్మ దేవస్థానం ఇఒగా బదిలీ చేశారు. దేవాదాయశాఖ ఎసి బాధ్యతలతో పాటు కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా శిరీష అదనపు బాధ్యతలు మరోమారు నిర్వహించనున్నారు. గతేడాది జులై ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 29వరకు సుమారు తొమ్మిది నెలలపాటు కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా శిరీష బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో ఆలయ ఆదాయం పెంపు, భక్తులకు

శిరీష

మెరుగైన సౌకర్యాలతో పాటు అమ్మవారి మార్గశిర మహోత్సవాలను విజయ వంతంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు.

ముఖ్యంగా అనకాపల్లిలో అన్యాక్రాంతమైన అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన కోట్ల విలువైన భూములను పరిరక్షించారు దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శిరీషకు మరోమారు కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఒగా అదనపు బాధ్యతలు అప్పగించగా, ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖపట్నం : వీధికుక్కల బెడద నుంచి అంగన్వాడీ పిల్లలకు రక్షణ కల్పించాలని శ్రీకాకుళం జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నేత, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మంగళవారం విశాఖపట్నంలో ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్నయిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం మెట్టవలసలో వీధికుక్కల దాడిలో సాత్విక అనే చిన్నారి మృతి చెందిన నేపథ్యంలో, అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను తీసుకెళ్లి, తిరిగి ఇళ్లకు సురక్షితంగా చేర్చే బాధ్యత ఆయాలకు అప్పగించాలన్నారు. సాత్విక కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గం కుప్పిలి లక్ష్మీపురం అంగన్వాడీలో విషాహారం తిని పిల్లలు అస్వస్థతకు గురైన నేపథ్యంలో, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కలిశెట్టి కోరారు.

ప్రగతిపథంలో ఎయు

మీడియాతో విసి ప్రసాదరెడ్డి

మాట్లాడుతున్న విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : గడిచిన నాలుగేళ్లలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఘనమైన వృద్ధిని సాధించిందని ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తెలిపారు. నాలుగేళ్ల కాలంలో ఎయులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఉదయం మీడియా ప్రతినిధులకు స్వయంగా చూపిస్తూ పలు వివరాలు వెల్లడించారు. ఎయు కన్వెన్షన్ సెంటర్ నుంచి ప్రారంభమైన మీడియా టూర్ సుమారు నాలుగు గంటలపాటు సాగింది. అనంతరం విసి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ సిటిజన్‌గా యువతను తీర్చిదిద్దుతున్నామన్నారు. వర్సిటీలో క్రీడ, మౌలిక వసతులు, హాస్టళ్ల నిర్మాణం, స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి అవకాశాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే విధంగా హబ్ ఏర్పాటు చేశామన్నారు. ఐదు అంతస్తుల్లో 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఆ హబ్‌లో 92 స్టార్టప్ కంపెనీలు పనిచేస్తున్నాయన్నారు. సిరిపురం వద్ద నిర్మించిన ఫార్మాహబ్–ఎలిమెంట్ త్వరలో సేవలు ఆరంభిస్తుందన్నారు. బయలాజికల్ మోనిటరింగ్ అంశంపై పనిచేస్తామన్నారు. ఎంఎస్ఆర్ విభాగంలో అవంతి ఫౌండేషన్‌తో దాదాపు రూ 12 కోట్ల వ్యయంతో వెట్‌ల్యాబ్, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి చేసేమని వివరించారు. ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం వద్ద నూతనంగా నిర్మించిన డిజిటల్ జోన్‌లో 10 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, సమావేశ మందిరాలు, 650 కంప్యూటర్లతో ఆన్లైన్ పరీక్షల నిర్వహించే సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. నాస్కామ్ సెంటర్ పనితీరును వివరించారు. ఇంజనీరింగ్ కళాశాలలో అభివృద్ధి చేసిన అంబేద్కర్ ఆడిటోరియాన్ని, శివాజీపాలెంలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని మీడియాకు చూపించారు. వర్సిటీ పరిధిలోని పలు భవనాలకు మీడియాను తీసుకెళ్లారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణ మోహన్, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వరాహలక్ష్మి నృసింహస్వామి వారి దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం జిల్లా

ఆర్.సి.నెం.సి3/01/2022, తేది: 24-04-2023 సెల్: 9885054588, 9160969755

తాత్కాలిక బహిరంగ వేలం ప్రకటన

శ్రీస్వామి వారి దేవస్థానం నందు తేది: 29-04-2023 ఉదయం గం.11.00లకు కొండ దిగువ దేవస్థానం కార్యాలయం నందు అనగా (తేది: 01-05-2023 నుండి తేది: 31-05-2023 వరకు) ఒక నెలరోజులకు ఈ క్రింది తెలిపిన వివిధ లైసెన్సు హక్కులకు తాత్కాలిక బహిరంగ వేలం నిర్వహించబడును. (1) కొండదిగువ భైరవవాక వద్ద పూజాసామగ్రి విక్రయించుకొనుటకు (2) కొండపైన సన్నిధి ఫలాలు (3) కొబ్బరి కాయలు మరియు పూజా సామగ్రి విక్రయించుకొనుటకు (4)తొలిపావంచా వద్ద భక్తులు సమర్పించిన కొబ్బరిముక్కలను ప్రోగు చేసుకొనుటకు (5) సెల్‌ఫోన్స్ మరియు కెమేరాలను భద్రపరచుకొనుటకు (6) భైరవస్వామి వారి దేవాలయం నందు ఐస్‌క్రీమ్ అమ్ముకొనుటకు (7) గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సంత మినహా మిగిలిన రోజులలో ఆకేలను వసూలు చేసుకొనుటకు (8) గురువారం సంతయందు ఆశీలను వసూలు చేసుకొనుటకు (9) గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సంత యందు ఆశీలను వసూలు చేసుకొనుటకు (10) పైడితల్లమ్మ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద కొబ్బరి ముక్కలు, చీరలు, రవికలు ప్రోగు చేసుకొనుటకు

సం/- వి.త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి

BEFORE THE HONOURABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE : VISAKHAPATNAM
ORIGINAL SUIT NO : 114 oF 2022

Between:
THOTTA VASUDEVARAO
. . . PLAINTIFF

And:
1. LANDA KORLAYYAMMA
2. LAND SATHIRAJU
. . . DEFENDENTS

To:
LANDA KORLAYAMMA,
S/o. Late Lakshmayya, Hindu, aged about 60 years, residing at D.No. 20-40-51-13/3, santhoshnagar, Kailasapuram, visakhapatnam 530024

Whereas the plaintiff filed the above suit against you for recovery of an amount of Rs. 34.33,300/- (Rupees Thirty Four Lakh Thirty Three Thousand Three Hundred Only) together with subsequent interest and costs. you are hereby summoned to appear before the Honourable Court in person or by a pleader duly instructed,and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions on: **11th May 2023 at 10.30 AM** to answer the final disposal of the suit take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

HO DT : 11th MAY 2023
VOLETI GOPAL ADVOCATE
D.No:49-29-3, Madhuranagar VISAKHAPATNAM-530016
Cell: 9676551782

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు గాజువాక
C.C. 283 / 2022

బిట్వీన్:
వై.శ్రీనివాసరావు . . . వాది / కంప్లయినెంట్
అండ్:
మురపాక విజయానందభూషణరావు
. . . ప్రతివాది / ముద్దాయి

ప్రతివాదికి నోటీస్

మురపాక విజయానందభూషణరావు, తండ్రి శ్రీనివాసరావు, డో.నెం. 2/27, వడ్లపూడి రైల్వేక్వార్టర్స్, రైల్వేహాస్పిటల్‌రోడ్ ఎదుట, శ్రీనగర్‌దరి, విశాఖపట్నం.

యిందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై కేసులో ప్రతివాదిలైన మీ హాజరు నిమిత్తం **తేది: 15-06-2023కి** వాయిదా వేసినారు. కావున యీ ప్రకటన నోటీసుగా భావించి పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30లకు** స్వయంగా గాని ప్లీడరుద్వారా గాని హాజరై వాదన చేసుకొనవలెను. లేనిచో పై కేసులో మీకు వాదన లేదని భావించి మీపరోక్షమున తీర్మానించడమగును.

కె.వి.స్వామి, అడ్వకేట్,
డో.నెం. 26-46-2/1, చైతన్యనగర్, పాతగాజువాక, విశాఖపట్నం.-26.
సెల్: 9948295935

పబ్లిక్ నోటీసు

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 135 / 2008
I.A.396/2014, I.A. 397/2014, I.A. 398/2014 I.A. 172 / 2023 I.A. 173/2023, I.A. 174/2023

బిట్వీన్:
దమ్ము సింహాచలం . . . వాది/పిటీషనరు
అండ్:
దమ్ము సత్తియ్య (Died) వగైరాలు
. . . ప్రతివాదులు / రెస్పాండెంట్స్
ఆర్-11: గొద్దు మహేష్, తండ్రి సూరకాంత
ఆర్-12: గొద్దు శంకర్, తండ్రి సూరకాంత
ఆర్-14: పోలారపు పైడమ్మ, భర్త లేటు సుదర్శనరావు

పైదావాలోని పై పిటీషన్‌లో రెస్పాండెంట్స్ 11,12,14లు అయిన మీకు శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం Section-5, Order-22, Rule-9, Order-22, Rule-4 పై తెలియపర్చిన I.A.లు 396/14, 397/14, 398/14 పిటీషనులో మీకు ఎన్నిసార్లు Process కట్టినను, తీసుకోకుండా, కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పత్రిక ప్రకటన మూలంగా తెలియపర్చవలసిందిగా ఆదేశాలు ఇవ్వడమైనది. కావున మీరు **01-05-2023 తేదీన ఉదయం గం. 10-30కు** ఖుద్దునగాని, వకీలుగారి ద్వారా గాని మీరు పై కోర్టు నందు హాజరై మీ అక్షేపణలు తెలియచేసుకోవలసినది లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి శ్రీకోర్టు వారు తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారము)
లాలం వెంకట రమణమూర్తి
వాది తరపు అడ్వకేట్, యలమంచిలి.
యలమంచిలి సెల్: 98484 28222
తే:25-4-23

శ్రీ కోర్టు వారి ఉత్తరువుల మేరకు మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 44/2015.

వాదులు/పిటీషనర్లు:
రుతల సింహాచలం (died) వగైరాలు
ప్రతివాది/ రెస్పాండెంట్లు:
కామిరెడ్డి గంగరాజు (died) వగైరాలు
సి.పి.సి. ఆర్డరు 5 రూలు 20 ప్రకారం ప్రతివాదులకు సమనుల ప్రకటన

టు:
12 వ ప్రతివాది :
కామిరి అంబికా రాదాదేవి D/o. శ్రీను @ శ్రీనివాసరావు, W/oనానాజీ, కొత్తవీది, నర్సీపట్నం మునిసిపాలిటి మరియు మండలం అనకాపల్లి జిల్లా
15వ ప్రతివాది :
కామిరెడ్డి లలిత D/o. లేట్ రాజు, కొత్తవీది, నర్సీపట్నం మునిసిపాలిటి మరియు మండలం అనకాపల్లి జిల్లా

పై నెంబరు దావా లో ఇందలి 12, 15(ప్రతివాదులు/ రెస్పాండెంట్లు ను పై నెంబరు దావాలో ప్రతివాదులుగా చేర్చెందా మని కోరుతూ పై I.A. 278/2022 ను దాఖలు చేయగా సదరు I.A. 278/2022 తే:27-04-2023దీన వాయిదా అయి యున్నందున మీరు స్వయంగా కాని అడ్వకేటు ద్వారాగాని **తే. 27-04-2023 దీన ఉదయం 10.30 గంటలకు** పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై శ్రీ కోర్టు వారికి మీ యొక్క అభ్యంతరాలను తెలియజేసుకొనవచ్చును. లేని యెడల తమ పరోక్షమందు పై వ్యాజ్యమును శ్రీ కోర్టు వారు నిర్ణయించెదరు.

వాయిదా తేది: 27.04.2022 బుధవారం.
మెట్ల ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
నర్సీపట్నం ఫోన్ నెం:81791 54586.
తే. 24.04.2023

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

ప్రజాశక్తి -ఆనందపురం: జాతీయ పంచాయతీరాజ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రథమ స్థానం నిలిచిన తొమ్మిది పంచాయతీలకు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఆనందపురం గ్రామ పంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో ఉత్తమ పంచాయతీగా అవార్డు ఎంపికైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థకు 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సర్పంచులు, సెక్రటరీలు భాగస్వామ్యులుగా ఈ అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. గ్రామాలాభివృద్ధికి సర్పంచులు తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడప లవరాజు, వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ మణిశంకర్‌నాయుడు, సర్పంచులు జి.శ్రీను, రమణ, చందక లక్ష్మి, బిఆర్‌బి నాయుడు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

అప్పన్న నిజరూప దర్శన ఫొటోలు హల్‌చల్

ప్రజాశక్తి-సింహాచలం: ఎంతో ప్రతిష్ఠాత్మకగా నిర్వహిస్తున్న చందనోత్సవంలో ఈయడాది కూడా స్వామి వారి నిజరూప దర్శనం వీడియోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. గతేడాది కూడా అంతరాయంలో స్వామి వారి నిజరూప దర్శనం వీడియో హోల్‌సేల్ చేసిన విషయం విధితమే. గత ఏడాది వీడియో తీసిన వారిని పట్టుకుని చర్యలు చేపట్టిన దాఖలు లేవు. కరోనా సమయంలో స్వామివారి చందనోత్సవం రోజు ఎవరికీ అనుమతి లేదని అధికారులు తెలిపినా ఒక వ్యక్తి మాత్రం అంతరాలయంలోకి స్వామి దర్శనానికి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఆ వ్యక్తిపై కూడా ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడంతో ఎవరికీ భయం లేకుండా పోయింది. దీంతో వీడియోలు తీసినా ఏమికాదులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. స్వామివారి వీడియోలు తీసిన వారిపై కఠిన చర్యలు చేపట్టడం, అంతరాలయ దర్శనానికి వెళ్లే వారి వద్ద సెల్ ఫోన్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విధంగా వీడియోలు తీస్తుంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, వాటిని నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో రహదారుల నిర్మాణానికి సోమవారం కార్పొరేటర్ కెల్ల సునీత భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఈ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, గ్రామ సంఘం అధ్యక్షులు వంకర బాబూరావు, సభ్యులు కాకర గోవింద, నల్ల సింహాచలం, నల్ల వీరబాబు, వెంకటేశ్వరరావు, లింగాల వెంకట శ్రీధర్, ఈరి నాగరాజు, రొట్ట సోమకాంత్ రంజిత్, షేక్ అబ్దుల్లా, చీకటి శ్రీను, నందిక సత్యనారాయణ పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మధురవాడలోని ట్రై జియో టెక్నాలజీస్‌లో జిఐఎస్, సిఎడి ఇంజినీర్లు 50 ఖాళీలకు సివిల్, మెకానికల్ డిప్లమో, బిటెక్ అర్హతతో 20 నుంచి 25 వయసు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.13,585 జీతం ఉంటుందని తెలిపారు. మద్దిలపాలెంలోని శ్రీనిధి అసోసియేట్స్‌లో టెలి కాలింగ్ వాయిస్ ఉద్యోగాలు 50 ఖాళీలకు ఏదైనా డిగ్రీ చేసి 18 నుంచి 25 వయసు గల మహిళలు అర్హులని, వీరికి నెలకు రూ.11 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని అప్టెక్‌లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలికాలర్ కం సోషల్ మీడియా బ్రౌజర్, అకౌంటెంట్ నాలుగు ఖాళీలకు ఏదైనా డిగ్రీ, ఎంబిఎ అర్హత కలిగి 22 నుంచి 30 సంవత్సరాల గల వారు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు జీతం ఉంటుందని తెలిపారు.ద్వారకానగర్‌లోని ఫిన్‌కేర్ బ్యాంక్‌లో సేల్స్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 12 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హతతో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, రూ.20 వేల నుంచి రూ.30 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఇక్షణ హోమ్‌కేర్ హెల్త్ సర్వీసెస్ కేర్ టేకర్స్, ఎఎన్‌ఎం, జిఎన్‌ఎమ్, బీఎస్సీ నర్సింగ్ ఉద్యోగాల 10 ఖాళీలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమో, ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం, నర్సింగ్ అర్హతలు కలిగి 18 నుంచి 35 సంవత్సరాలు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.10 వేలు జీతం ఉంటుందని తెలిపారు. గవర కంచరపాలెంలోని క్రిష్ కార్ప్ లిమిటెడ్ (యాక్సిస్ బ్యాంక్)లో రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 50 ఖాళీలకు ఇంటర్, ఏదైనా డిగ్రీ కలిగి 18 నుంచి 39 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ఆశీల్‌మెట్టలోని రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఏదైనా డిగ్రీ చేసిన వివాహిత మహిళలు 27 నుంచి 50 మధ్య వయస్సు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.16 వేలు జీతం ఉంటుందని తెలిపారు. యుఎస్‌ఐటి రిక్రూటర్ ఉద్యోగాలు 15 ఖాళీలకు, మధురవాడలోని రోవర్ ఐటి టెక్నాలజీస్‌లో బెంచ్ సేల్స్ రిక్రూటర్ ఉద్యోగాలు 10 ఖాళీలకు, ఐటి రిక్రూటర్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంబిఏ ఇన్ హెచ్‌ఆర్ అర్హత కలిగి 21 నుంచి 35 సంవత్సరాల వారు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని వివరించారు. వెబ్ డెవలపర్ ఉద్యోగాలు 15 ఖాళీలకు బీటెక్ అర్హతతో 21 నుంచి 35 మధ్య వయస్సు గలవారు అర్హులని, నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. శ్రీ సాయి మధు ఇంజినీరింగ్ అండ్ టెక్ సర్వీసెస్‌లో ట్రైనీ ఆపరేషన్స్ ఉద్యోగాలు ఆరు ఖాళీలకు డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ అర్హత కలిగి, 18 నుంచి 25 మధ్య వయస్సు గలవారు అర్హులని, వీరికి రూ.10 వేల నుంచి రూ.12 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. బెంగళూరులోని కోజెంట్ ఈ సర్వీసెస్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 30 ఖాళీలకు 19 నుంచి 35 సంవత్సరాల వయసు, ఏదైనా డిగ్రీ ఉన్న వారు అర్హులని, వీరికి నెలకు రూ.16 వేలు జీతం, ఇన్సెంటివ్ ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, 28వ తేదీన జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

లెక్క తేలని అప్పన్న చందనం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం చందనోత్సవం అయిపోయి రెండురోజులు కావస్తున్నా ఇంతవరకు స్వామిపై ఒలిసిన చందనం ఎన్ని కేజీలు వచ్చిందన్న విషయాన్ని అధికారులు తెలియజేయలేదు. దీనిపై ఏ అధికారిని అడిగినా తమకు తెలియదనే సమాధానం వస్తోంది. ఏటా స్వామి వారి చందనం కోసం భక్తులు ఆత్రంగా ఎదురు చూస్తారు. చందనం ఎన్ని కేజీలు వచ్చిందో ఇంతవరకు తెలియజేయకపోవడంతో చందనం విక్రయాలు ఎప్పుడు చేపడతారోనని భక్తులు ఎదురుచూస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచి గండ్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. వైఎస్ఆర్ కంటి వెలుగుతో అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉచిత ఆపరేషన్లు, కళ్లజోళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మౌలాలి, హెల్త్ విజిటర్ గంగా భవాని, ఎఎన్ఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గెద్దపేటలో గడపగడపకు...

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామంలో నాడు- నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన పాఠశాల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, సర్పంచ్ కె.లక్ష్మణ, వైస్ ఎంపిపి మంజుభార్గవి పాల్గొన్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష

దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏపి గురుకులాల్లో ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 24 నుంచి 28వ తేదీకి పొడిగించినట్లు స్థానిక ఏపి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్, జిల్లా కో-ఆర్డినేటర్ కోడి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5 నుంచి 8 తరగతులు, జూనియర్ కళాశాలలో మొదటి ఏడాది, డిగ్రీ కళాశాలలో తొలి ఏడాదిలో 2023-24లో ప్రవేశానికి ఏపిఆర్‌ఎస్‌సిఏటి -2023, ఏపిఆర్‌జెసి అండ్ డిసిసిఇటి 2023కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. https ://aprs.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన కుషాల్ ప్రాజెక్టులో భాగంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. గర్భిణిలు, బాలింతలకు న్యూట్రిషన్ డిమాన్‌స్ట్రేషన్ ఆక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల నుంచి రుతు విరతి మహిళల వరకు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాసవ్య మహిళ మండలి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ప్రసన్నలక్ష్మి, రమ్య వివరించారు. రాగి పిండితో వెజిటబుల్స్ ఉప్మా చేసి రాగి పిండి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సంతోషి, ఎఎన్ఎం భవాని, మహిళా పోలీసులు దివ్య, సంతోషి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయరహదారి కంబాలకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... సారిక సునీత (30) దొండపర్తిలో తండ్రి అప్పారావు, ఆదిలక్ష్మితో కలిసి నివాసముంటున్నారు. మధురవాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై హనుమంతువాక నుంచి మధురవాడవైపు వెళ్తున్నారు. జాతీయరహదారి కంబాలకొండ సమీపంలో ఆమె ద్విచక్రవాహనం అదుపుతప్పి కుడి వైపు పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ సునీత తలపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆరిలోవ ఎస్ఐ అనీల్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్లియర్ చేశారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

భవనం నుంచి జారిపడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక నాగేంద్రకాలనీలో నిర్మాణం జరుగుతున్న ఓ ఇంటి రెండో అంతస్తు నుండి సోమవారం సాయంత్రం జారిపడి భవన కార్మికుడు మృతి చెందాడు. కశింకోట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన అప్పికొండ రాంబాబు పట్టణంలోని నాగేంద్రకోలనీలో జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుండి జారి పడడంతో తలకు బలమైన గాయమైంది. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అకాల మృత్యువాత పడ్డ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని మర్చురీకి తరలించారు.

ప్రయివేటు స్కూళ్ల గుర్తింపు పెంపుపై హర్షం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రయివేటు పాఠశాలల రికగ్నైజేషన్ కాలపరిమితిని మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంపుదల చేయడం హర్షణీయమని అపుస్మా రాష్ట్ర చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఎంవి.రావు, రాష్ట్ర ఐటి విభాగం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఖాసీం పేర్కొన్నారు. సోమవారం స్థానిక అయ్యన్న స్కూల్లో విలేకర్లతో మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో రికగ్నైజేషన్ కాలపరిమితిని పెంచారన్నారు. దీనిపై కృషి చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కమిషనర్ సురేష్ కుమార్‌కు అపుస్మా సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా రాజబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైసిపి జోన్ ఎస్‌సి సెల్ ఇన్‌ఛార్జిగా అల్లంపల్లి రాజబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యాన రాజబాబును సన్మానించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ, అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలతో మూడు జిల్లాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డికి, ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు, ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు, అవంతి శ్రీనివాసరావుకు, అక్కరమాని విజయనిర్మలకు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాసరావుకు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డైట్‌లో సీనియర్ ఉపన్యాసకులు జిజిఎస్ నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆంగ్ల రచయిత విలియం షేక్స్‌పియర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ అర్పించారు. డైట్ వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ మాట్లాడుతూ, ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవడం ద్వారా రాబోయే కాలంలో ఉన్నతోద్యోగాలు వస్తాయని వివరించారు. తెలుగు మాధ్యమంలో చదువుతున్నప్పటికీ ఆంగ్లంపై నిరంతరం సాధన చేయడం వల్ల భయాన్ని పోగొట్టుకో వచ్చని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు జె.మాధవి, ఎస్.త్రినాథరావు, పి.హరిణి, ఎం.మహాలక్ష్మి, షేక్ అల్లాఉద్దీన్, జి.రవి, సోమయాజులు పాల్గొన్నారు.

మళ్ల, కృష్ణమూర్తి కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆరిలోవ : గుండెపోటుతో ఈ నెల 19న మృతిచెందిన సిపిఎం సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి కుటుంబాన్ని మంగళవారం ఆరిలోవలోని వారి ఇంటి వద్ద సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పరామర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణను, కుమార్తె శార్వాని, కుమారుడు మోహన్, అల్లుడు కృష్ణ, కోడలు లావణ్య, మనవులు, మనవురాళ్ళను పరామర్శించి, ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణమూర్తి మృతి సమయంలో తాను ఢిల్లీలో ఉన్నానని చెప్పారు. తాను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శిగా ఉన్న సమయంలో కృష్ణమూర్తితో ఎంతో అనుబంధం, సాన్నిహిత్యం ఉండేదని తెలిపారు. ఆరిలోవ కాలనీ ప్రారంభంలో అనేకసార్లు ఈ ప్రాంతాన్ని సందర్శించి మౌళిక వసతుల కల్పన కోసం కృష్ణమూర్తితో కలిసి కృషి చేశామని తెలిపారు. కృష్ణమూర్తి నిబద్ధత కలిగిన కార్యకర్త అని, అతనికి ఏ బాధ్యత అప్పగించినా తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా నిర్వహించేవారని తెలిపారు. పార్టీ కార్యాలయంలో అకౌంట్స్ నిర్వహణను క్రమశిక్షణగా నిర్వహించారని కొనియాడారు. కృష్ణమూర్తి మరణం వారి కుటుంబానికే కాకుండా కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టుకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, నాయకులు బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ, భూలోకరావు, కె.సత్యనారాయణ, వి.తులసిరావు, ఐసి.నాయుడు, సుందరయ్యనగర్ గ్రామ సంఘం నాయకులు అప్పలనాయుడు, వై.అప్పారావు, సూర్యనారాయణ, రాఘవులతో పనిచేసిన డేవిడ్ నాగేశ్వరరావు, రమణ తదితరలు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బివి.రాఘవులు

అనకాపల్లి : సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ మళ్ల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని మంగళవారం సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వేర్వేరుగా పరామర్శించారు. సత్యనారాయణ భార్య సరోజినీ, కుమారులు డాక్టర్ జగదీష్, సుందర వాసులను ఓదార్చారు. వారి వెంట సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు, బి ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మళ్ల సత్యనారాయణ కుటుంబీకులను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

వినతులను పరిశీలిస్తున్న కెకె.రాజు

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యాలయానికి వచ్చిన సమస్యలతో కూడిన వినతులను కెకె.రాజుకు అందించారు. వినతి పత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ 29వ వార్డు పరిధి వెంకటపతిరాజునగర్‌లో కార్పొరేటర్ వురికిటి నారాయణరావు ఆధ్వర్యాన వైసిపి నాయకులు సీతంరాజు సుధాకర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలంలో చలివేంద్రాలు ప్రారంభించడం వల్ల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం ప్రకాష్‌రావుపేటలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న టైలర్ రామకృష్ణకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నీలకంఠం, కండిపల్లి సతీష్‌కుమార్, చోల్లంగి శేఖర్, సారిపిల్లి వెంకటరమణ, సింగంపల్లి వెంకట్, కిలాని వెంకటేష్, రాజు, ఓమ్మి కిషోర్, డోప్ప సూరిబాబు, గండి అప్పలరాజు, కోన గౌతమ్, పిల్ల గోవింద్, పసుపులేటి అప్పలరాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మను రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు, ఉత్తర నియోజకవర్గ కార్పొరేటర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పలు అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనుక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపిల్లి గోవింద్, బర్కత్ అలి, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ళ లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, కెవిఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు ఇన్‌ఛార్జిలు నీలి రవి, పీలా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శర్మ

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అగనంపూడికి చెందిన పూర్ణానందశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు పూర్ణానందశర్మను మంగళవారం అగనంపూడిలో వైసిపి నాయకులు కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా పూర్ణానందశర్మ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు వస్తుందన్నారు. ఈ పదవి రావడంలో సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పూర్ణానంద శర్మ ఆధ్వర్యాన అగనంపూడి నాయకులు కార్యకర్తలు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు యలమంచిలి అప్పారావు, పెదిరెడ్డి హరీష్, పట్టా రామకృష్ణ, యలమంచిలి కృష్ణప్రసాద్, దామురోతు అప్పలరాజు, ఏదూరి సోమునాయుడు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాలు

ప్రజాశక్తి -తగరపువలస : వేసవి నేపథ్యంలో మంగళవారం పలు సంఘాల ఆధ్వర్యాన స్థానికంగా పలుచోట్ల మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. శ్రీ ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన స్థానిక జంక్షన్‌లో, వై జంక్షన్ వద్ద షిరిడి సాయి ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

తగరపువలసలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన టైలర్లు

నమ్మిదొడ్డిలో యుపిహెచ్‌సి ప్రారంభం

అందుబాటులోకి వైద్యం : మంత్రి విడుదల రజని

నమ్మిదొడ్డిలో యుపిహెచ్‌సిని ప్రారంభిస్తున్న మంత్రి రజిని

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంచడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని అన్నారు. నమ్మిదొడ్డిలో యుపిహెచ్‌సిని మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, రూ.కోటి ఖర్చుతో నమ్మిదొడ్డి జంక్షన్‌లో పది పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ సమీప ప్రాంతాలైన పాలవలస, దేవాడ, ఇస్లాంపేట ప్రజలకు ఈ ఆసుపత్రి అందుబాటులో ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య సదుపాయాలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి కోసం అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సత్యవతి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, కార్పొరేటర్ సూర్యకుమారి, మద్ది శ్రీను, ఎమ్‌పి.రెడ్డి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లతో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. జగనన్నే మా భవిష్యత్తు, గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులు, నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. కార్పొరేటర్లు అందరూ ఒక రిపోర్టు తయారుచేసుకుని పనులను పరిష్కరించే విధంగా ప్రణాళిక చేయాలని కెకె.రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కెవిఎన్ శశికళ, వార్డు అధ్యక్షులు నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంచుమాంబ పండగ

ప్రజాశక్తి-కంచరపాలెం : జీవీఎంసీ 57 వార్డు పరిధి మర్రిపాలెం గ్రామ దేవత కుంచుమాంబ పండుగను మర్రిపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యాన మంగళవారం వైభవంగా నిర్వహించారు. మర్రిపాలెం పరిసర ఏడు గ్రామాల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పలు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటుచేసి మజ్జిగ, శీతల పానీయాలను అందజేశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు, కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ, టిడిపి అధికార ప్రతినిధి పోలమరశెట్టి శ్రీను, నర్సకుమారి, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడమే ధ్యేయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడమే ప్రధాన ధ్యేయంగా కార్మికులు కృషిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం పిలుపునిచ్చారు. సిఐటియు సీనియర్ నాయకులు, త్రిఫ్ట్ మాజీ సెక్రటరీ కిష్టన్న 14వ వర్ధంతి సందర్భంగా కెవిపిఎస్, ఎపిజిఎస్ ఆధ్వర్యాన వడ్లపూడిలో 'ప్రభుత్వ రంగం- రిజర్వేషన్లు' అంశంపై సదస్సు నిర్వహించారు. కెపి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో లోకనాథం, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు బొండ తౌడన్న, సత్యనారాయణ, స్టీల్ సిఐటియు అధ్యక్షుడు వైటి.దాస్ ప్రసంగించారు. సామాజిక బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, రిజర్వేషన్ల సాధనకు కృష్ణన్న పోరాటాలు చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. రిజర్వేషన్లను కాపాడుకోవడానికి ముందుగా ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ ఆయన స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వరకుమార్ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కె.ఆనంద్, ఆర్.నరసింహ, సత్యనారాయణ, నరసింహ, సుబ్బన్న, బొంజు బాబు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న తౌడన్న, వేదికపై లోకనాథం

పోరాట విజయం

పాత రేట్లు ప్రకారం కూలి చెల్లించడానికి రుషిల్ డెకార్ యాజమాన్యం అంగీకారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రుషిల్ డెకార్ ప్లై వుడ్ పరిశ్రమలో ముఠా కార్మికులు గత 21 రోజులుగా చేపట్టిన పోరాటం విజయం సాధించింది. కంపెనీ పాత రేట్లు ప్రకారం కూలి చెల్లించడానికి పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు పరిశ్రమ పిఆర్ఓ శ్రీనివాసరావు, హెచ్ఆర్ మేనేజర్ నాగేష్ మంగళవారం నిరసన శిబిరం వద్దకు వచ్చి ముఠా కార్మికులకు తెలియజేశారు. తమకు పాత రేట్లు ప్రకారం కూలి చెల్లించాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ వద్ద ముఠా కార్మికులు 21 రోజులుగా నిరాహార దీక్ష విషయం తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యాన దశలవారీగా అనేక ఉద్యమాలు చేపట్టారు. కలెక్టర్, మంత్రి అమర్‌నాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, స్థానిక తహశీల్దారు, ఎమ్మెల్యే కన్నబాబు రాజు తదితరులను కలిసి తమ సమస్యలను వివరించారు. చివరకు సోమవారం ఎమ్మెల్యే కన్నబాబు రాజును కలిసి పరిశ్రమ పిఆర్ఓ హెచ్ఆర్ మేనేజర్‌తో చర్చలు జరిపారు. ఆ చర్చలు ఫలప్రదం కావడంతో మంగళవారం ముఠా కార్మికులు చేస్తున్న నిరసన శిబిరం వద్దకు పరిశ్రమ పిఆర్ఓ శ్రీనివాసరావు, హెచ్ఆర్ మేనేజర్ నాగేష్ వచ్చి ముఠా కార్మికులతో మాట్లాడారు. ముఠా కార్మికులతో జరిగిన ఒప్పందం ప్రకారం లారీకి రూ.500, వ్యాన్‌కు రూ.300, ట్రాక్టర్‌కు రూ.200, తాార్వాతాడు లారీ కడితే రూ.700 ఇస్తామని తెలిపారు. ఈ విషయం లారీ యజమానులకు తెలియజేసి మంగళవారం పాత రేట్లు అమలు చేస్తామని చెప్పారు. దీనిపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఒప్పందం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్లి నానాజీ, అంది అప్పలనాయుడు, బయలుపూడి రమణ, గుర్రం సూరిబాబు, గొర్లి సత్తిబాబు, తాతారావు, అంది గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

యుపిహెచ్‌సిని ప్రారంభిస్తున్న మంత్రి రజని

యుపిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి- పరవాడ : జివిఎంసి 85వ వార్డు, లంకెలపాలెం రూ.1.23 కోట్లుతోనూ నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, చుక్క రామునాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు పాల్గొన్నారు.

హిందుజాకు మేలు చేకూర్చే చర్యలు ఆపాలి

ప్రజాశక్తి-పరవాడ

హిందుజా పరిశ్రమకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మేలు చేకూర్చే ప్రతిపాదనలు ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే హిందూజా పరిశ్రమకు రూ.800 కోట్లు కట్టబెట్టారని, మరో రూ.1600 కోట్లు చెల్లించాలని ప్రతిపాదన చేయడం దుర్మార్గమన్నారు. ఈ చర్య వల్ల విద్యుత్ వినియోగదారులపై భారం పడుతుందని తెలిపారు. ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్ కంపెనీకి మేలు చేయడం తగదన్నారు. విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే చర్యలు ఆపకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పరవాడ మండలంలో లంకెలపాలెం, పరవాడ మీదుగా ప్రయాణిస్తున్న హిందూజా బొగ్గు లారీలు వల్ల ధూళి కాలుష్యంతో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. అధిక బొగ్గు లోడ్ వలన రోడ్లు ధ్వంసమవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూజా పరిశ్రమకి కొమ్ము కాయడం మాని ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

హెరిటేజ్ రైతులకు రుణాల పంపిణీ

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని మర్రిపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు రూ.6.50 లక్షలు రుణాలను మంగళవారం డెయిరీ మేనేజర్ కె శేషు పంపిణీ చేశారు. అలాగే డెయిరీకి పాలు పోస్తున్న ఎ.అరుణకు చెందిన రెండు పాడి ఆవులు కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడంతో ఆమెకు బీమా సొమ్ము రూ.1.20 లక్షలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు ఎ.శంకర్రావు, దొరబాబు, అరుణ, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి బుక్‌లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ చేతుల మీదుగా వీరబ్రహ్మేంద్రస్వామి బుక్ లెట్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక నరసింగరావుపేట ఎంవిఆర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సతీష్ మాట్లాడుతూ కసింకోట మండలం కన్నూరు పాలెంలో నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం బుక్ లెట్‌ను, తీడ గ్రామంలో మే 11న జరిగే భారీ అన్న సమారాధన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని సతీష్ తెలిపారు. శ్రీలక్ష్మీ గణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సింహాసనం, వీరబ్రహ్మేంద్రస్వామి శ్రీమాత గోవింద మాంబ సిద్ధయోగి ధ్వజస్తంభ, పసిడి కలశ ప్రతిష్ఠ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నూరు పాలెం, తీడ గ్రామాల నాయకులు, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ముత్యాల సతీష్

ఒప్పంద పత్రాలు చూపుతున్న కొరియా, డైట్ ప్రతినిధులు

దక్షిణ కొరియా కంపెనీతో డైట్ ఒప్పందం

ప్రజాశక్తి-అనకాపల్లి : డైట్ కళాశాలలో కంప్యూటర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సౌత్ కొరియాలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇరు వర్గాలు మంగళవారం అంగీకార ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ సౌత్ కొరియాకు చెందిన మస్ట్ ఫిన్ టెక్ టెక్నాలజీ సంస్థ సిఈఓ చాజూ హన్, సిటిఓ చొ ఛుంగ్ హ్యూన్, షాహిన్ ఒప్పందంలో పాల్గొన్నారని తెలిపారు. తమ విద్యార్థులు కంప్యూటర్ రంగంలో ఉపాధికి ఈ ఒప్పందం ఎంతో దోహదపడుతుందన్నారు. సౌత్ కొరియా ప్రతినిధులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఆంధ్ర యూనివర్సిటీ తరువాత డైట్ కళాశాలతోనే ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. కళాశాల విద్యార్థులకు ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ తెలుసుకొని తమ కంపెనీ నుంచి నిధులు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, ప్లేస్మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన వాటికి మంగళవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. పేదరికం లేని మెరుగైన ఉపాధి పంచాయతీగా కె.కోటపాడు,క పింద్రంగి, గొండుపాలెం, ఆరోగ్యం పరిరక్షణ పంచాయతీలుగా పాతవలస, దాలివలస, ఎ.భీమవరం, పిల్లలతో స్నేహపూరం పంచాయతీలుగా దాలివలస, కె.కోటపాడు, ఆర్‌వై అగ్రహారం, తాగునీరు సరఫరాలో డి.అగ్రహారం, దాలివలస, ఆర్‌వై అగ్రహారం, పారిశుద్ధ్యం పరిశుభ్రతలో పాతవలస, పింద్రంగి, స్వయం అభివృద్ధి సదుపాయాలు పంచాయతీలుగా కె.కోటపాడు, చౌడువాడ, దాలివలస, సామాజిక భద్రత కలిగిన పంచాయతీలుగా దాలివలస, కె.కోటపాడు, పింద్రంగి, ప్రభుత్వ కార్యక్రమాలు అమలులో కె.కోటపాడు, పింద్రంగి, సూదివలస, మహిళ స్నేహపూర్వక పంచాయతీలుగా దాలివలస, ఎ.భీమవరం, పోతనవలస ఎంపికయ్యాయి. ప్రతిభ కనబరిచిన పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ కె.శశిదేవి ఎంపీపీ రెడ్డి మోహన్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపిడిఒ శశిదేవి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఎపి జెఎసి అమరావతి ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు అనకాపల్లి జిల్లా జేఏసీ అమరావతి యూనిట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు, ఏఐటియుసి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగస్తులతో సమానంగా వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియారిటీ అర్హతను బట్టి రెగ్యులర్ చేయాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. ఏపీ అమరావతి జేఏసీ అనకాపల్లి యూనిట్ అధ్యక్షులు సింగంపల్లి వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి లోవరాజు, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు పి రత్నం, కార్యదర్శి వై శ్రీరామ్ మూర్తి, కేజీబీవీ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్‌బిటిఎస్ దేవి, ఏపీ వర్క్స్ ఆర్ట్, పి.ఈటి సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఏపీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా కార్యదర్శి డిఎన్ మూర్తి, ఆరోగ్య శాఖ నుంచి నాని, ఏపీ లేబర్ డిపార్ట్మెంట్ మినిస్టీరియల్ స్టాఫ్ అధ్యక్షులు కె ప్రభాకర్ రావు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వివి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కోన లక్ష్మణ, ఎల్‌వి రమణ, పంచాయతీరాజ్ శాఖ నుంచి వి.దేవి వరప్రసాద్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి కె అప్పారావు ప్రసంగించారు.

ధర్నాలో అభివాదం చేస్తున్న ఉద్యోగులు

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని రైతుల ఆందోళన

విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-చోడవరం

వ్యవసాయ మోటార్లకు నెలరోజుల నుండి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోయాయని అంకుపాలెం గ్రామానికి చెందిన రైతులు విద్యుత్‌శాఖ ఏడి కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దానిని పునరుద్ధరించడానికి విద్యుత్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వీరికి మండలంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నాగులపల్లి రాంబాబు, గౌరీపట్నం సర్పంచ్ కోన చంద్రావు, శ్రీరామపట్నం సర్పంచ్ వెంకటరమణ, జన్నవరం సర్పంచ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చోడవరం మండల విద్యుత్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తుందన్నారు. ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. మండల సమావేశంలో వీరి అవినీతిపై విచారణ జరపాలని తీర్మానించామని గుర్తు చేశారు. తక్షణమే అధికారులపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కోలా పద్మావతి, దేవుడు, రాకోటి సత్తిబాబు, ముగ్గిన గోవింద, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని జి.భీమవరం పంచాయతీలో 40,000 లీటర్ల మంచినీటి పథకానికి మంగళవారం కొత్త మోటార్ బిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా మంచి నీటిని సరఫరా చేసేందుకు నూతన మోటార్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ బర్నికాన చిన్నోడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ స్కూల్లో విద్యార్థులకు స్థానిక అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వడదెబ్బ నివారణకు హోమియో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేషగిరిరావు మాట్లాడుతూ చిన్నారులు వేసవిలో ఎండలకు దూరంగా ఉండాలని, ఎక్కువగా తాగునీరు తీసుకోవాలని సూచించారు. వేసవి సెలవులలో చిన్నారులు మంచి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. అతిథి దేవోభవ సంస్థను అభినందించారు. సంస్థ కార్యదర్శి కామేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తాం

ప్రజాశక్తి - కశింకోట : వైసిపి ప్రభుత్వం తొలగించిన పింఛన్లను టిడిపి అధికారంలోకి రాగానే పునరుద్ధరిస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి నిరంకుశ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపికి చెందిన 4వ వార్డు మెంబర్ తెరపల్లి అప్పారావు టిడిపిలో చేరగా, ఆయనకు పీలా గోవింద కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పీలా మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి నియోజకవర్గంలో 6వేల పింఛన్లను అన్యాయంగా తొలగించారన్నారు. టిడిపి నాయకులు కాయల మురళి, వేగి గోపికృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, గొంతిని శ్రీనివాసరావు, కర్రి దుర్గి నాయుడు, ఆనాల తాతినాయుడు, జెర్రిపోతుల నూకినాయుడు, కోన రమణ, బోని గణేష్, ఉల్లింగల, రమేష్, కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కె.కోటపాడు : నువ్వులు సాగు చేసే రైతులు విత్తన శుద్ధిపై అవగాహన కలిగి ఉండాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఉమ, తేజేశ్వరి అన్నారు. మండలంలోని సింగన్నదొరపాలెం గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు నువ్వులు పంటపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు నువ్వుల్లో విత్త శుద్ధి గురించి వివరించారు. ఒక కేజీ నువ్వుల విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజమ్ కలిపి ఒకరోజు తరువాత పొలాల్లో వెదజల్లినట్లయితే పంటను వేరు కుళ్ళు నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నైరా కళాశాల విద్యార్థులు, పుష్ప మంజరి, స్నేహలత, వందన, రైతులు పాల్గొన్నారు.

డిడిఒలుగా అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఓల అధికారాల విషయంలో ఖజానా శాఖ నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి మంగళవారం జిల్లా ఖజానా అధికారి సుభాషిణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర యుటిఎఫ్ నాయకత్వం కృషి ఫలితంగా జీవో నెంబర్ 84 ద్వారా మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడివోలు సంక్రమించాయని తెలిపారు. వారికి అందించాల్సిన అధికారాల విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని, ట్రెజరీ వెబ్సైట్లో డిడివోలుగా చేర్చుటకు అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు.

గుల్లేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి రామాలయం వద్ద మంగళవారం ఉదయం అనిల్ నీరుకొండ హాస్పిటల్ వారి సహకారంతో గుల్లేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బండారు మంగ శ్రీనివాసరావు, ఎంపిపి బోకం సూర్యకుమారి రాము నాయుడు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ప్రశాంత్ జనరల్ మెడిసిన్, డాక్టర్ సుప్రియ గైనకాలజిస్ట్, డాక్టర్ మౌనిక కంటి వైద్యులు, డాక్టర్ హర్షిణి చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ పృథ్వీ ఎముకలు, కీళ్ల వైద్యులు పాల్గొని సుమారు 200 మంది రోగులను షుగర్ బిపి, ఈసిజి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన 20 మంది రోగులను ఆపరేషన్ నిమిత్తం హాస్పటల్‌కు బుధవారం తరలిస్తామన్నారు. పిఆర్ఓలు రాము, రమేష్ జోషేప్, సతీష్, ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

ఘనంగా మలేరియా దినోత్సవం

కంచరపాలెంలోని బాలికల ఐటిఐలో విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న మురళీమోహన్

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి మలేరియా నివారణపై అవగాహన కల్పించారు.

ములగాడ : జీవీఎంసీ 40వ వార్డు ఎకెసి కాలనీలో జీవీఎంసీ బయాలజిస్ట్ చక్రవర్తి పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జోన్ - 5 కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మలేరియా సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సెక్రటరీలు, మలేరియా సూపర్ వైజర్లు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ వాలంటీర్లు పాల్గొన్నారు.

కంచరపాలెం : కంచరపాలెంలోని ప్రభుత్వ బాలికల ఐటిఐలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ శాఖ ట్రెజరర్ డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ మలేరియా వ్యాప్తి, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దోమతెరను వాడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ గౌరీమణి, లెక్చరర్, సబ్ యూనిట్ అధికారి మాధవీలత, సిబ్బంది, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలస పిహెచ్‌సి ఆధ్వర్యాన మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిహెచ్‌సి వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా గంట స్తంభం వరకు చేరింది. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శోభారాణి, ఆరోగ్య విస్తరణాధికారి జి.రాజ్‌కుమార్, వెలుగు ఎపిఎం బి.రంగారావు, స్త్రీనిధి మేనేజర్ సుశీల గ్రేసీ, హెల్త్ అసిస్టెంట్లు, సిసిలు, విఒ, ఒబిఎస్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు వెలుగు కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆనందపురం : మండలంలోని కుసులవాడ పంచాయతీ ఇచ్చాపురంలో ఆనందపురం పిహెచ్‌సి ఆధ్వర్యాన మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, సిహెచ్‌ఓపి స్వర్ణలత, ఆరోగ్య కార్యకర్తలు మెట్ల దేవి, ఆర్.నాగేశ్వరరావు, ఆశా కార్యకర్త దేవుడమ్మ, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

మాడుగుల : మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తత పాటించి, జాగ్రత్తలు వహించాలని కే.జే పురం పిహెచ్‌సి వైద్యాధికారులు ప్రసాద్ పాత్రుడు, లీలా ప్రసాద్ తెలిపారు. జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మాడుగుల, కే జే పురం గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనాఫిలస్ అడ దోమ కారణంగా మలేరియా వ్యాపిస్తుం దని, పరిసరాలు పరిశుభ్రంగా వుంచడం ద్వారా దీని బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, సిహెచ్ఓ కామేశ్వరి, సిబ్బంది వెంకటరావు, ఏ ఎన్ ఎం లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మలేరియా దినోత్సవం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు సంతోష్ కుమార్,

గొలుగొండ : కేడీపేట పిహెచ్‌సిలో జాతీయ మలేరియా దినోత్సవాన్ని వైద్యాధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, వైద్యాధికారులు పిహెచ్‌సి నుండి గ్రామంలో మెయిన్ రోడ్డులో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు గాయిత్రి, హరి ప్రవీణ్ మాట్లాడుతూ, మలేరియా నిర్మూలనకు ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో మంగళవారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు మంచినీరు నిల్వ ఉన్నచోట గుడ్లుపెట్టి అభివృద్ధి చెందుతాయని, అందువల్ల వారికి ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మురళీ కృష్ణ, సత్యవతి, సత్యనారాయణ, మున్నా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మలేరియా ఫైలేరియా తదితర దీర్ఘకాలిక వ్యాధులను వ్యాపింపజేసే దోమల పట్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రజని అన్నారు. మండలంలోని ఉప్పవరం గ్రామంలో మంగళవారం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణీంద్ర, చిన్ని రమణ, వైసిపి నాయకుడు భీమని నాగేశ్వరరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : ప్రతి ఒక్కరూ పరిసరాల పరి శుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని పిహెచ్సీ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం మలేరియా వ్యాధిని అరికట్టాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ దేవకాంత, స్టాఫ్ నర్స్ సలీమా, ల్యాబ్ టెక్నీషియన్ శిరీష, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి లాల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ డాక్టర్ హేమంత్

దోమల నిర్మూలన అందరి బాధ్యత

మలేరియా దినోత్సవంలో డిఎంహెచ్ఒ డాక్టర్ హేమంత్

అనకాపల్లి : దోమల నిర్మూలన మన అందరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ నెహ్రూ చౌక్, మెయిన్ రోడ్డు, బాలాజీ రావు పేట మీదుగా తిరిగి ఎన్టీఆర్ ఆసుపత్రి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాప్తికి దోమలు ప్రధాన కారణమని, దోమల వ్యాప్తికి మురికి గుంటలు, ఇళ్లల్లో నీరు నిల్వ ప్రధాన కారణమని తెలిపారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడం, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, మందులు చల్లడం, ఫ్యాగింగ్ నిర్వహించడం, వారానికి ఒకరోజు డ్రైడేగా పాటించడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ శారద బాయి, జిల్లా మలేరియా అధికారి ఉమామహేశ్వరరావు, మలేరియా శాఖ, జీవీఎంసీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- పరవాడ : మండలంలోని కన్నూరు పంచాయతీ మడకపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ సుమారు రూ.76 లక్షలతో మంత్రిపాలెం నుండి మడక పాలెం వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం రూ.8.65 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఎమ్మెల్యే అదీప్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపిపి బూస అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రామునాయుడు, కోన రామరావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపిడిఓ హేమ సుందరరావు, తహసీల్దార్ ప్రకాశ్ రావు, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, ఎంపిటిసి గొల్లవిల్లి శ్రీను, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అర్హత ఉండి అందని వారు ఉంటే చెప్పాలని, వారికి న్యాయం చేసే బాధ్యత వహిస్తానని ఎమ్మెల్యే రమణమూర్తి రాజు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 13, 14 వార్డుల్లో పర్యటించి లబ్ధిదారుల్ని కలిసి ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ పిళ్లా రమాకుమారి, డిసిసిబి మాజీ ఛైర్మన్ సుకుమారవర్మ, ఎంపిపి బోదెపు గోవిందరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలను వచ్చేనెల 28న ఘనంగా నిర్వహించాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలపై ప్రతిపక్షం అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లాలో ఉన్న సహకార చక్కర కర్మాగారాలను జగన్ రెడ్డి ఎన్నికల హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆధునికీకరణ చేయాలని, రైతుల బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు లాలం కాశీనాయుడు, కరక సత్యనారాయణ, కూర్మదాసు నూకరాజు, బొండా సన్నీ దేవుడు, చల్ల నానాజీ, ఏపీఎం సత్యనారాయణ, నక్కపల్లి రాఘవ, గొళ్ళు రమణ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల జిల్లా గౌరవాధ్యక్షులు సత్యనారాయణ మృతి

సత్యనారాయణ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఉమ్మడి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గాలి సత్యనారాయణ (65) మంగళవారం తెల్లవారుజామున అకాల మరణం చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, కె.కోటపాడు, దేవరాపల్లి జడ్పిటిసిలు అనురాధ, సత్యం, మండల వైఎస్ఆర్‌పి అధ్యక్షులు బూరె బాబురావు, టిడిపి మాడుగుల ఇన్చార్జి పివిజి కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్ల అసోసియేషన్ సంఘం జిల్లా ప్రతినిధులు, మండల నాయకులు సత్యనారాయణకు నివాళులర్పించారు. అనంతరం దేవరాపల్లిలో సత్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు.

బోరుబావి ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన బోరు బావిని స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం కర్రివీధిలో జరుగుతున్న డ్రైనేజీ పనులను, దేశపాత్రునిపాలెం శివాలయం జంక్షన్ వద్ద హైమాక్స్ రింగు లైటు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మచ్చా శివకుమార్, నాయకులు పిల్ల నూకరాజు, బొండా రామానాయుడు, కర్లం అప్పారావు, ముజ్జి శ్రీనివాస్, పిల్ల మధు, జాజుల చిన్న, జాజుల జనార్దన్, మచ్చ కుమార్, పిల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.7.5 కోట్లు మంజూరు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-మాడుగుల:రహదారి నిర్మాణానికి రూ.7.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం డి.గొటివాడ, శ్రీరామపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిగొట్టివాడ నుండి మాడుగుల మోదమాంబ కాలనీ వరకు తాచేరుపై వంతెనతో పాటు నిర్మాణానికి 7.5 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. గ్రామస్తులతో ముచ్చటించారు. తమది జవాబు దారి ప్రభుత్వమని, ఇచ్చిన మాట మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ సారధ్యంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తమ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగానే ఉన్నారన్నారు. 479 ఇళ్లకు గాను ఇంటింటికీ మంచి నీరు సరఫరా నిమిత్తం రూ.1.49 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. విద్యుత్ సమస్యలు గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, రెండు గ్రామాల్లోనూ రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 16 లక్షలతో నాడు నేడు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, జడ్పీటిసి రమణమ్మ, తహసీల్దార్ రత్నం, ఎంపీడీఓ మీనా కుమారి, పెద్ద సంఖ్యలో వైసిపి నేతలు పాల్గొన్నారు

నాడు నేడు పనులకు శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న బూడి

మే డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు

ప్రజాశక్తి - నాతవరం: మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారుమండల కేంద్రంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్మిక వాడలలో మే డేను ఘనంగా జరపాలన్నారు. మే 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మేడే స్ఫూర్తితో ఉపాధి హామీ, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, ఎడ్లబండ్ల, జీడిపిక్కల కార్మికులను కలుపుకొని గ్రామాలలో సిఐటియు జెండాలను ఆవిష్కరణలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు లక్ష్మి, లక్ష్మీబాయ్, మాణిక్యం, అంగనవాడి యూనియన్ నాయకులు ఎన్.వసంత, మణి, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు అమ్మాజీ, అప్పలనర్స, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

రంగురాళ్ల తవ్వకాలపై రాజకీయం

- వైసిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సాలిక మల్లవరంలో జరిగిన రంగురాళ్ల తవ్వకాల వివాదంలో టిడిపి నిజనిర్ధారణ కమిటీ పేరుతో హడావిడి చేయడం సిగ్గుచేటు అని వైసిపి మండల యువజన అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, వైసిపి అధికార ప్రతినిధి అప్పలస్వామినాయుడు, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, పెదిరెడ్ల అప్పలనాయుడులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకే ఆయన మంచితనం ముందు నిలబడలేక టిడిపి కుట్ర రాజకీయాలకు తెర లేపిందన్నారు. అసలు టిడిపిలోనే అధిక సంఖ్యలో రంగురాళ్ళ వ్యాపారులు ఉన్నారని వారి పెట్టుబడుతూనే ఇటువంటి కాలం చెల్లిన ఆరోపణ చేస్తూ చవకబారు రాజకీయాలు చేస్తుందని పేర్కొన్నారు.టిడిపి అంటే తెలుగు దొంగల పార్టీ అని దోచుకో దాచుకో పంచుకో అన్న నినాదంతోనే తెలుగుదేశం పార్టీ పని చేస్తుందని ఆరోపించారు. కొంతమంది రంగురాళ్ళ వ్యాపారులు తమ వ్యవహారాలు బయటపడకుండా పెట్టుబడులు పెట్టి ఇటువంటి కుట్ర రాజకీయాలకు తెరలేపి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పారదర్శకంగా సేవలు అందించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:సచివాలయ సిబ్బంది ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని ఎంపీడీవో సీతారామరాజు, ఈ వోపిఆర్డి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని జానకయ్యపేట సచివాలయంను మంగళవారం సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం సిహెచ్ లక్ష్మీపురంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాన్ని వెంటనే వాడుకలోకి తీసుకు రావాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

శ్రమదానంతో శ్మశానం అభివృద్ధి

ప్రజాశక్తి-రోలుగుంట: బుచ్చింపేట గ్రామంలో నవతరం గ్రామీణ అభివృద్ధి సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో బుచ్చింపేట గ్రామంలో శ్మశానవాటిక ప్రాంత అభివృద్ధికి సంస్థలోని యువకులు నడుం బిగించారు. గ్రామ శివారులో ఉన్న ఈ ప్రాంతానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో శ్మశాన వాటికకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేయాలంటే ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యేవారు. వీరికి కష్టాలను గుర్తించిన నవతరం గ్రామీణ అభివృద్ధి సంస్థ యువకులు ఒక్క అడుగు ముందుకు వేసి ఈ సమస్యను తామే పరిష్కరించాలని లక్ష్యంగా చేసుకొని బాధ్యత తీసుకున్నారు. సంస్థ నిధులతో రైతుల వద్ద నుంచి గ్రామంలో నుంచి శ్మశానవాటికకు వెళ్ళే రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని సంబంధిత రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి రహదారి మార్గాన్ని నిర్మించారు. దీనితో పాటుగా ఈ శ్మశాన వాటిక ప్రాంతం లోతుగా ఉండడంతో వర్షాకాలం లో దీనికి ఇరువైపులా ఉన్న పంట పొలాల నుంచి వచ్చే నీరు, వర్షపు నీరు చేరి అంత్యక్రియలు నిర్వహించ డానికి తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండేవారు. ఇది గ్రహించిన యువకులు ఈ సమస్యను తామే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తు శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న చుట్టూ ప్రక్కల పొలాలకు సంబంధించిన రైతులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీపురుపల్లి వెంకు నాయుడు, పాటూరి రాజునాయుడు, గొల్లు సన్యాసినాయుడు, నవతరం గ్రూపు సభ్యులు సబ్బవరపు చంటి, కర్రి వెంకటరమణ, జిగిరెడ్డి గణేష్, అనిమిరెడ్డి రమణ, పెబ్బిలి శ్రీను, గాలి శివాజీ, మద్దాలి సాయి, కర్రి ఎరుకునాయుడు, అనిమిరెడ్డి ప్రసాద్, సబ్బవరపు సత్తిబాబు, జిగిరెడ్డి వెంకటరమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన శ్మశానం ఇదే..

కుటుంబ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కుటుంబ నియంత్రణ పట్ల గిరిజనులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పరిధిలో 11 మండలాల ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లతో నిర్వహించిన సమావేశంలో రక్తహీనతపై ఆరా తీసిన కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ చేసుకోవడం తో లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. పునరుత్పత్తి హక్కు అయినందున, ఎవరినీ బలవంతం చేయరాదని, వారికి అవగాహన కల్పించి వారి నిర్ణయానికే విడిచి పెట్టాలని సూచించారు. జిల్లాలో అనేకమంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు రక్త హీనతతో బాధ పడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి వారికి తగు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, చికిత్సలు అందించాలన్నారు. ముఖ్యంగా ఐరన్ పోలిక్ ఏసిడ్, మల్టీ విటమిన్లు అందించాలని సూచించారు. ఇతర వ్యాధులతో బాధ పడుతున్న వారిని గుర్తించి తగు చికిత్సలు అందించాలని ఆదేశించారు. గర్భవతులను ముందుగానే గుర్తించి నమోదు చేయడంతో వారిని ట్రాక్ చేయడానికి వీలవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్‌సిహెచ్ నమోదు ముందుగా చేయాలని పలువురు సిడిపిఓలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు సంబంధించి ఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.సూర్యలక్ష్మి, సిడిపిఓలు, సూపర్వైజర్లు, కార్యాలయ పర్యవేక్షకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కవగుంటలో వైద్యశిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -రావికమతం: పేద ప్రజలందరికీ గ్రామ స్థాయిలోనే ఉచిత వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సదుపాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలంలోని కవగుంట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మంది రోగులకు డాక్టర్ శ్రావ్య వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీయూపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,వైద్య శిబిరం వద్దకు రావడానికి అవకాశం లేని రోగులకు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ కుమారి, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

కానరాని 'నాడు - నేడు'

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు పనులు గిరిజన గ్రామమైన అల్లుమయ్యపాలెం స్కూల్లో చేపట్టక పోవడం పట్ల విద్యార్థులతో పాటు గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ప్రజాశక్తి విలేకరి నాడు నేడు పనులు మంజూరు కాలేదా అని అడిగిన ప్రశ్నకు సమాధానం నాడు లేదు నేడు లేదు అని వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, ఏళ్ళు గడుస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో శిథిలమైన భవనాన్ని విడిచి పక్కనే ఆంజనేయ స్వామి విగ్రహం చెట్ల కింద విద్యార్థులు చదువుకోవలసి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిల భవనం పెచ్చులు ఊడిపడి పోతూ ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని తొలగించి కొత్త భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆరుబయట చదువుతున్న విద్యార్థులు

సర్పంచ్‌లకు అవార్డులు

ప్రజాశక్తి -రోలుగుంట:పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మడలంలో నీరు సమృద్ధిగా ప్రజలకు అందజేయడానికి కృషి చేసిన ఎస్.కొత్తూరు సర్పంచ్ పోతలరాజు శేఖర్‌కు, బుచ్చింపేట సర్పంచ్ ఉలబాల చంద్రకు జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి చేతుల మీదుగా శాలువతో సత్కరించి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఈఈపిఆర్‌డి మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

చెక్కు ను పంపిణీ చేస్తున్న బ్రాంచ్ మేనేజర్

బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని బోడపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన దాకారపు వెంకటరమణ భార్య బుల్లమ్మకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం కింద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నుండి 2 లక్షల పాలసీ సొమ్మును అందించినట్లు బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు, గ్రామ సర్పంచ్ ఎరుకు నాయుడు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం చెక్కును అందజేశారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న అప్పలరాజు, రజకులు

పరిహారానికి రజకుల వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం సేకకరిస్తున్న భూములకు నష్ట పరిహారం చెల్లించాలని డిఎల్ పురం గ్రామానికి చెందిన రజకులు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రజకులు మంగళవారం తహాశీల్దార్ నీరజకు వినతిపత్రం అందజేశారు. తామంతా పూర్వం డి ఎల్ పురం గ్రామంలో కులవృత్తి రజక (బట్టలు ఉతకడం) వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామంలో బట్టలు ఉతక డానికి అనువైన స్థలం లేక పోవడంతో 100 సంవత్సరాల క్రితం బాపట్ల గ్రామానికి చెందిన కొడవటిపూడి రత్తయ్య తన స్వంత భూమి సర్వే నెంబరు 85లో 3-08 సెంట్ల భూమిని రజక వృత్తి చేసుకోవడానికి దానంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆనాటి నుండి నేటి వరకు ఆ భూమిలో రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ అధికారులు ఆ భూమిని సేకరించడం జరిగిం దన్నారు. ఆ భూమిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నష్ట పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.దుర్గాప్రసాద్, ఎం.దేవుడు, జీ.మూలయ్య, ఎం.ఆదియ్య, పీ.వీరన్న, బి.మన్నియ్య, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అస్తవ్యస్తం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇటీవల నిత్యం వర్షం కురుస్తుండడంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణం అస్తవ్యస్తంగా మారుతోంది. వాన నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి పలు ప్రదేశాలు అద్వానంగా తయారవు తున్నాయి. ఫారెస్ట్ క్వార్టర్స్ సమీపంలోని పాడేరు-చింతపల్లి ప్రధాన రహదారి పక్కన వర్షం నీరు నిలిచి పోవడంతో అధ్వానంగా ఉంది. సుండ్రుపుట్టు, లోచలిపుట్టు వీధుల్లోని రోడ్లు వాన నీటి నిలువతో అధ్వానంగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

కె.కోటపాడులో చేపడుతున్న ప్రచారం

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం, సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. ప్రచార భేరి కార్యక్రమాన్ని అనకాపల్లి, విశాఖ జిల్లాలో ముమ్మరంగా నిర్వహించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

మునగపాక రూరల్: ప్రజా కంఠక మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ప్రచార భేరిలో భాగంగా శనివారం రాత్రి స్థానిక సంత బయలులో ప్రచారం నిర్వహించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ, అమిత్ షా నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం ఆదానీ, అంబానీ లాంటి సంపన్నులకు విద్యుత్, ప్రాజెక్టులు, గనులు, భూములు, అడవులతో పాటుగా పలు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతుందని విమర్శించారు. సిపిఎం నాయకులు టెక్కలి జగ్గారావు, పెంటకోట శివ గణేష్, విల్లూరి నాయుడు, అప్పారావు, సూరిబాబు పాల్గొన్నారు.

28వ తేదీన అచ్యుతాపురంలో జరుగు ప్రచార భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని యాదగిరి పాలెంలో సోమవారం రాత్రి ప్రచార భేరి నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజీలు, ఎరువులు రేట్లు విపరీతంగా పెంచిందని తెలిపారు. సిపిఎం నాయకులు బుద్ధ రంగారావు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కశింకోట : ప్రచార భేరి కార్యక్రమంలో సిపిఎం నాయకులు

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నేతలు

దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. దీనిపై రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు నోరుమెదపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బి.నూకరాజు, వి.బెన్నయ్య, అప్పారావు, నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో మంగళవారం సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించి ఉపాధి కూలీలను కలిశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఆర్.రాము మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి పూనుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.కనుమునాయుడు, ఎం.పరదేశి నాయుడు, కే సదాశివరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని పంచదార్ల గ్రామంలో సిపిఎం ప్రచారభేరిలో భాగంగా ఆ పార్టీ మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు, నాయకులు సిహెచ్ రామకృష్ణ. ఉపాధి హామీ కూలీలను కలిశారు. ఉపాధి కూలీలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

గొలుగొండలో

కె.కోటపాడు : కె.కోటపాడు మండల కేంద్రంలోని సిఐటియు ఆఫీసు నుంచి పలు వీధుల్లో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకొని సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వేముల కన్నబాబు, గరికిన రాజు ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించి ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూడా ప్రకాష్, అల్లు శ్రీను, కూడా లక్ష్మణ పాల్గొన్నారు.

కశింకోట : ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. కశింకోటలో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం సత్తిబాబు, నాయకులు వీయ్యపు రాజు, సత్యనారాయణ, లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల, యర్రవరం గ్రామాలలో మంగళవారం వామపక్షాల ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను తాకట్టు పెట్టి నిరుద్యోగులను గాలికి వదిలేసిందన్నారు. కార్పొరేట్ సంస్థలను పెంచి పోషిస్తున్న బిజెపి ప్రభుత్వానికి పాడి కట్టించాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారాలు మోపుతుందన్నారు. పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి. మరోచేతితో పన్నులు భారం వేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం సభ్యులు జి.గురుబాబు, డి.సి.హెచ్.క్రాంతి, మండల కార్యదర్శి మేకా భాస్కర్, ఏఐవైఎఫ్ నాయకులు జి.రాధాకృష్ణ, ఎన్.శ్రీరాంమూర్తి, కె.అప్పలనాయుడు, మర్రి అప్పలనాయుడు, కిల్లాడ రాము, సుర్ల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

కంచరపాలెం : మర్రిపాలెం శివనగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెలుగు రమణ, ఒ అప్పారావు, ఎం ఈశ్వరరావు, కె లక్ష్మణ్, బి వినోద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు పరిధి కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్, వన్ టు త్రీ సుజాతనగర్, బి జోన్, సి వన్ జోన్, సీ టు జోన్ పరిధి వెంకటాద్రినగర్, డాక్ యార్డ్ లే-అవుట్ తదితర ప్రాంతాలలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రజాభేరి నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను కలిసి బిజెపి విధానాల ద్వారా జరుగుతున్న నష్టాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, నాయకులు అసిరినాయుడు, నారాయణరావు, రమణ, సిపిఎం నాయకులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో...

రంగురాళ్ల తవ్వకాల్లో..

ప్రధాన సూత్రధారులెవరో..?

అటవీశాఖ అధికారుల హస్తంపై ఆరోపణలు

ప్రజాశక్తి-గొలుగొండ:గత రెండు రోజులుగా సంచలనంగా మారిన గొలుగొండ మండలం సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీ తవ్వకాల ఘటన ఇప్పుడు మరో సంచలనంగా మారతోంది. అటవీ శాఖ అధికారుల తీరు, చర్యలు విస్మయానికి గురి చేస్తున్నాయి. గత శుక్రవారం రాత్రి సాలిక మల్లవరం రంగురాళ్ల క్వారీలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ వాహనాలను ఉపయోగించి లారీలతో రంగురాళ్లు కలిగిన మట్టిని తరలించిన విషయం తెలిసిందే. దీంతో, ఇటు టీడీపీ, అటు అధికార వైసిపి పార్టీల అధినాయకుల సైతం విమర్శనాస్త్రాలు గుప్పించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు, తీసుకుంటున్న చర్యలు పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ తవ్వకాలు జరిగినట్లుగా విషయం తెలుసుకున్న నర్సీపట్నం డిఎఫ్ఒ రాజారావు క్వారీని సందర్శించి ఎంత మేరకు మట్టి తవ్వారో కొలతలు వేయించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ, క్వారీలలో తవ్వకాలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామని, వారి రాకపోకలు కనిపెట్టి ఈ తవ్వకాలకు పాల్పడ్డారని చెప్పారు. మరుసటి రోజు అసలు అక్కడ తవ్వకాలు జరగలేదని, పైపొర మట్టి మాత్రమే తవ్వారంటూ మాట మార్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. డిఎఫ్ఒ రాజారావు ఇచ్చిన స్టేట్‌మెంట్లతో ఈ ప్రాంతీయులు అయోమయానికి గురయ్యారు. ఇంతలోనే స్క్వాడ్ డిఎఫ్ఒ శ్యామ్‌సుందరం ఆదివారం రంగురాళ్ల క్వారీని పరిశీలించి ఇక్కడ తవ్వకాలు జరిగాయని, కొంత మట్టిని తరలించుకుపోయారంటూ, తవ్వకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తవ్వకాలు జరిగినప్పటికి నిర్లక్ష్యం వహించారంటూ ఫారెస్ట్ బీట్ అధికారి లోవకుమార్, స్ట్రైకింగ్ ఫోర్సు ఉద్యోగి మహేష్‌లను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. దీంతో అటవీ అధికారులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రకటనలు చేయడం కింది స్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఈ ప్రాంతీయులను విస్మయానికి గురి చేస్తోంది. కోట్ల రూపాయల విలువైన రంగురాళ్లు తవ్వుకు పోయారంటూ రాజకీయ పార్టీలు ఆరోపణలు గుప్పిస్తుండగా అటవీ అధికారులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా తవ్వకాలు జరిగాయని ఒకరు, జరగలేదని మరొకరు, తవ్వకాలు జరిగాయని నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని తొలగించామని, ఇలా చర్యలు తీసుకోవడంతో ఈ ప్రాంతీయులు విస్మయానికి గురవుతున్నారు. ఇంతకి ఆ రోజు రాత్రి ఇక్కడ తవ్వకాలు జరిగాయా లేదా అని అటవీ ఉన్నతాధికారులు నిర్ధారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీలో గత శుక్రవారం రంగురాళ్ల తవ్వకాలు జరగడం వెనుక డిఎఫ్ఒ రాజారావు హస్తం ఉందని ఈ ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. రేంజ్ అధికారి, బీట్ ఆఫీసర్ సెలవుపై వెళ్లడం, అదే రోజు రాత్రి భారీ ఎత్తున రంగురాళ్ల తవ్వకాలు జరగడం, తవ్వకాలు జరిగిన అనంతరం క్వారీని సందర్శించిన డిఎఫ్ఒ ఇక్కడ తవ్వకాలు జరిగాయని చెప్పడం, మరుసటి రోజే ఎటువంటి తవ్వకాలు జరగలేదని చెప్పడం, ఇదే సంఘటనలో ఇద్దరు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తు సస్పెండ్ చేయడం వంటి అంశాలను పరిశీలిస్తే ఈ తవ్వకాలకు డిఎఫ్ఒ రాజారావుకు సంబంధం ఉన్నట్లుగా ఈ ప్రాంతీయులు చర్చించుకుంటున్నారు. క్వారీని సందర్శించి

క్వారీని కొలతలు కొలుస్తున్న అటవీ సిబ్బంది (ఫైల్ ఫొటో)

పైపొర మాత్రమే తవ్వారని పేర్కొన్న డిఎఫ్ఒ రాజారావు మరి సిబ్బందిని ఎందుకు సస్పెండ్ చేశారో అంటూ పలువురు గుసగుసలాడుతున్నారు. దీన్ని బట్టి డిఎఫ్ఒకు తెలిసే ఇదంతా జరిగిందని పలువురు అనుకుం టున్నారు. అసలైన తవ్వకందారులను దాచి పెట్టేందుకు క్షేత్ర స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకొని అటవీశాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తవ్వకందారులు ఎవరనేది అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. గత మూడు నెలల క్రితం ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరిగిన తవ్వకాలకు సంబంధం ఉన్న కీలకమైన వ్యక్తులే సాలికమల్లవరంలో జరిగిన తవ్వకాల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని ఈ ప్రాంతంలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో పెట్టిన కేసులు అలాగే ఉన్నాయి. ఈ తవ్వకాల కోసం తెలుగుదేశం నాయకులు ఆరోపించినట్లు కొంత మంది సెల్‌ఫోన్ల కాల్‌డేటాను పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది. కానీ అధికారులు అసలు చర్యలు చేపట్టడానికి సుముఖంగా ఉన్నట్లు కనిపించలేదు.